# భ్రమలు నీడలు

– ఎస్. హన్మంత్రావ్

బ్యాంక్‌లో గడియారం ఏడు గంటలు ఠంగ్ ఠంగ్‌న కొట్టింది.

నిర్ధారణ కోసం అన్నట్టుగా వాచీ చూసుకున్నా. కరెక్టుగా ఏడే. టాలీ అయిన లెడ్జర్ని మూస్తూ తోటి ఆఫీసరైన జమాల్‌తో "ఇక లేద్దామా?" అన్నా.

"ఒన్ మినిట్" తను చూస్తున్న కరెంట్ ఎక్కౌంట్స్ బుక్‌ని మూసి అలసటగా కుర్చీ వెనక్కి చేరబడ్డాడు.

అసలే శీతాకాలం. ఆపైన బంగాళాఖాతంలో వాయుగుండం... ఇక చెప్పాలా చలి సంగతి...

జీతాల మాట అటుంచితే, ఈ బాంక్ ఆఫీసరంత వెధవ ఉద్యోగం మరోటి వుండదు అనిపించింది. జమాల్‌కి లాగానే నాకూ చాలా అలసటగా వుంది. ఏదో కొంచెం రిలీఫ్ కావాలనిపించింది.

"డ్రింక్ చేద్దామా?" హఠాత్తుగా అన్నా.

"ఏంటి డ్రింకే?!...ఎక్కడ సంపాదించావ్. ఎవరైనా ఎక్స్ సర్వీస్ వాడి దగ్గరా... లేక...?" సంభ్రమంతో ప్రశ్నల పరంపర...

"పద" నవ్వుతూ సీట్లోంచి లేచా.

"బాగా అలసిపోయాం. ఇప్పుడు మందు వుంటే, గొప్ప రిలీఫ్!" ఉత్సాహంగా అన్నాడు జమాల్. మళ్ళీ ఏదో అనుమానం వచ్చి... "కొంపదీసి కూల్ డ్రింకా?" అడిగాడు.

"నో... వాతావరణం ఇంత కూల్‌గా వుంటే ఇంకా కూల్ డ్రింకా?... హాట్ డ్రింకే!" నవ్వేశాను.

మేనేజర్, ఇతర ఆఫీసర్లు బాంక్‌ని క్లోజ్ చేసే పనిలో వుండగా ఇద్దరం 'గుడ్‌నైట్' చెప్పి బయటపడ్డాం.

అసలే మందు భాయి అయిన జమాల్‌కి నా మాటలు ఊపిరి ఆడనివ్వడం లేదు. నిషేధం రాకముందు రోజూ తాగందే నిద్రపోయేవాడు కాదు అతను. ఒళ్ళు అలసేలా పనిచేయడం– ఆపై ఫుల్‌గా తాగడం అతని అలవాటు. ఇప్పుడు మందు కోసం చాలా పాట్లు పడుతున్నాడు అతను. నాకైతే ఎప్పుడో పార్టీల్లో పుచ్చుకోవడం తప్ప పెద్దగా అలవాటు లేదు.

ఇద్దరం బ్యాంకు వున్న మేడ మెట్లు దిగి బాగా రద్దీగా వున్న రోడ్డు మీదికి వచ్చాం. నేను ముందు నడుస్తుంటే, ఉద్వేగంగా నన్ను అనుసరిస్తున్నాడు జమాల్.

నేను మోడరన్ కేఫ్‌లోకి దారి తీశాను.

"ఇప్పుడు హోటల్ కెందుకు?" చిరాగ్గా అడిగాడు. నేను పట్టించుకోకుండా వెళ్ళి మూలగా వున్న టేబుల్ దగ్గర కుర్చీలో కూర్చున్నా. ఇక తప్పదన్నట్టుగా తనూ నాకు ఎదురుగా కూర్చున్నాడు. ఆర్డర్ తీసుకోడానికి వచ్చిన సర్వర్‌తో "రెండు స్ట్రాంగ్ కాఫీ" అని చెప్పా.

"మరి డ్రింక్ సంగతి?" అసహనంగా వుంది జమాల్ స్వరం.

"కాఫీ డ్రింక్ కాదా?" కొంటెగా అన్నా.

నేను చేసిన చమత్కారానికి అతని మొహంలో ఒక్క క్షణం నవ్వు తళుక్కుమంది. కాని అది కొద్దిసేపే. వెంటనే అతని మొహంలో నిరుత్సాహం ఒక్కసారిగా గూడుకట్టుకుంది.

"కొన్ని పదాలకి నిజానికి వాటికి లేని విలువని ఆపాదిస్తాం... అలాగే కొన్ని అలవాట్లకి కూడానేమో!" అన్నాను.

సాలోచనగా తలూపాడు.

కాఫీ పూర్తి చేసి ఉత్సాహంగా బయటపడ్డాం.

"వెలుతురిచ్చే దీపమే నీడకీ ఆస్కారమిస్తుంది. మన మనసనే దీపం భ్రమల నీడలకి అవకాశమిస్తుంది. ఈ నీడల విషయంలో మనం జాగ్రత్తగా వుండాలి... వీటిని అధిగమించాలి" నడుస్తూ అన్నాను జమాల్‌తో.

❀

## ఈ వారం అబద్ధాలు

"తెలుగుదేశంపార్టీలో 1984లో జరిగింది వెన్నుపోటుకాదు, 1995 ఆగస్టులో జరిగిందే అసలైన వెన్నుపోటు"

– మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు

సేకరణ: గవర్రాజు రాజం రాజు
గణపవరం – 522 619

(*'ఆంధ్రజ్యోతి, 1–11–95, గుంటూరు ఎడిషన్*

"ప్రధాని నన్ను రైల్వేశాఖ మంత్రిపదవి నుంచీ తప్పించినందుకు నేనేమీ బాధపడటం లేదు"

– కేంద్రమంత్రి జాఫర్‌షరీఫ్

సేకరణ: సయ్యద్ ఆరిఫ్, అనంతపురం.

*('ఈనాడు' 28–10–95)*

"రానున్న పార్లమెంటు ఎన్నికలలో మొత్తం 42 స్థానాలనూ కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుంది"

– రాజ్యసభ సభ్యుడు పి. ఉపేంద్ర

సేకరణ: బి.ఎ.ఎస్. ప్రసాద్
వుల్లలపాడు – 534 112

*( 'ఆంధ్రజ్యోతి' 31–10–'95)*

"ఉత్తరప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడు జరిగినా 'బహుజన్ సమాజ్‌పార్టీ' 250 స్థానాలలో గెలుపొందుతుంది"

– బి.ఎస్.పి. అధినేత కాన్షీరాం

సేకరణ: బి. ప్రమీలాకుమారి
కొత్తపేట, తూర్పుగోదావరి జిల్లా.

*( 'ఆంధ్రప్రభ' 29–10–'95)*

"రష్యా అధ్యక్షుడు బోరిస్ ఎల్ట్సిన్ మరణించినందుకు సంతాపం తెలియజేస్తున్నాను"

– బ్రిటిష్ పార్లమెంటులో కన్సర్వేటివ్ పార్టీ సభ్యుడు డెల్విన్

– సేకరణ: ఎల్. తెనిన్, పాత అనంతపురం.

*( 'ఈనాడు' 28–10–95)*